భవన నిర్మాణం 'క్రిటికల్'

- నత్తనడకన క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు
- చెల్లింపునకు నోచుకోని రూ.4 కోట్లు
- దొరకని ఇసుక,గ్రావెల్

తెనాలిఅర్బన్: దేవుడు కరుణించిన పూజారి వరం ఇవ్వలేదన్న చందాన తెనాలిలోని క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణం తయారైంది. కేంద్ర ప్రభుత్వం దీని నిర్మాణానికి సంబంధించిన నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని సదరు కాంట్రాక్ట్ సంస్థకు చెల్లించకుండా నిలిపివేసింది. దీంతో సదరు కాంట్రాక్టర్ నెల నుంచి పనులలో జాప్యం చేస్తు వస్తున్నారు.

తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో 100 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించాలని కేంద్రం భావించి అందుకు అవసరమైన అనుమతులిచ్చింది. అలాగే దాని నిర్మాణం కోసం రూ.45 కోట్ల నిధులు వెచ్చించింది. స్థల కేటాయింపు.. పాత భవనాలు కూల్చివేత వంటి పనులు పూర్తి చేసుకుని 2023 డిసెంబర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎలిక్సర్ మిట్ ఫాం ప్రవేట్ లిమిటెడ్ సంస్థ పనులు ప్రారంభించింది. మొదట్లో పనులు వేగవంతంగా జరిగాయి. నెల నుంచి పనులలో జాప్యం జరుగుతూ వస్తోంది.

నిధుల కేటాయింపులు ఇలా...

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.45 కోట్లలో రూ.22 కోట్లు భవన నిర్మాణ పనులకు కేటాయించారు. మిగిలిన నిధులు అపరేషన్ థియేటర్‌లో, క్యాజువాలిటీలలో వస్తువుల కొనుగోలు, వార్డులలో మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా నాలుగు ఫ్లోర్‌లతో దీనిని నిర్మించనున్నారు.



నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం

క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఉండే విభాగాలు ఇవి.

క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) విభాగాన్ని 20 పడకలతో (చిన్నపిల్లలకు అవసరమైన నాలుగు బెడ్‌లు కలిపి) ఏర్పాటు చేయనున్నారు. అలాగే హైడిఫినిషన్ యూనిట్ (హెచ్‌డీయు)-20 పడకలు, ఐసోలేషన్ వార్డు-30 పడకలతో, ఐసోలేషన్ గదులు-12, డయాలసిస్ బెడ్‌లు-4, ఎంసీహెచ్ (బాలింతలకు)-4 బెడ్‌లు, అత్యవసర విభాగం -10 పడకలతో నిర్మించనున్నారు. ఇవి కాకుండా మూడవ అంతస్తులో రెండు ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేయనున్నారు.

నిలచిన రూ.నాలుగు కోట్ల చెల్లింపులు

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు చేస్తున్న ఎలిక్సర్ మిట్ ఫాం ప్రవేట్ లిమిటెడ్ సంస్థ సుమారు రూ.అయిదు కోట్ల పనులు పూర్తి చేసింది. గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి అవసరమైన మట్టిని త్రవ్వి పిల్లర్స్ ఏర్పాటు చేశారు. అలాగే కొంత మేర గోడలు నిర్మించారు. దీనికి సంబంధించిన రూ.4 కోట్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. కానీ ప్రభుత్వం నిధుల చెల్లింపులు చేయకుండా అపివేసింది. కేంద్రం నుంచి నిధులు వచ్చినా వాటిని చెల్లించటంలో జాప్యం చేస్తున్నట్లు సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ బిల్లుల చెల్లింపులు జరిగే వరకు పనుల వేగవంతాన్ని తగ్గించారు. దీంతో నెల నుంచి నత్తనడకన పనులు సాగుతున్నాయి.

దొరకని ఇసుక, ఎర్ర మట్టి

క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణానికి అవసరమైన ఇసుక దొరకటం లేదని నిర్మాణదారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచితంగా ఇసుకను ఇస్తామని ప్రకటించి అమలు చేస్తున్నట్లు గొప్పలు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే తక్కువ ధరకు ఇసుక లభించిందని నిర్మాణదారులు చెబుతున్నారు. అంతేకాకుండా అధిక ధరకు దానిని కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే బేసిమట్టం మధ్యలో వేసే గ్రావెల్ (ఎర్రమట్టి) సకాలంలో దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్, ఎంపీడీవోలకు తెలియజేసిన ప్రయోజనం ఉండటం లేదని వారు తెలిపారు. ఎన్నిసార్లు వారి చుట్టూ తిరిగినా ఇప్పటి వరకు ఒక లారీ కూడా ఇప్పించలేక పోయారని వారు వాపోతున్నారు. ప్రభుత్వ భవనాలకు కూడా సకాలంలో ఇసుక, గ్రావెల్‌ను సరఫరా చేయకపోతే ఎలా నిర్మాణాలు చేస్తామనే ఆవేదనను వారు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బిల్లుల చెల్లింపులు జరపటంతో పాటు ఇసుక, గ్రావెల్‌ను సరఫరా చేసే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనులు వేగవంతం చేస్తాం

తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో రూ.45 కోట్లతో నిర్మిస్తున్న అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులలో కొంత జాప్యం జరుగుతున్న మాటవాస్తవం. బిల్లుల చెల్లింపు కొంత ఆలస్యమైంది. రెండు, మూడు రోజుల్లో వాటి చెల్లింపులు జరిగే అవకాశం ఉంది. నిర్మాణ పనుల్లో వస్తున్న అడ్డంకులను అధిగమించేలా ప్రయత్నించి వేగవంతం చేస్తాం.

– హనుమంత్ నాయక్, డీఈ, ఏపీఎంఎస్ఐడీసీ, గుంటూరు.

క్లుప్తంగా

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి

మున్సిపల్ ఆర్ఎం హరికృష్ణ



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ గుంటూరు రీజనల్ మేనేజర్ హరికృష్ణ ఆదేశించారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులోని కుక్కల శస్త్ర చికిత్సాలయం, వర్మీ కంపోస్ట్ యూనిట్‌లను పరిశీలించారు. కుక్కల శస్త్ర చికిత్సలు నిలచిపోవటంపై ఆరా తీశారు. వెంటనే శస్త్ర చికిత్సలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే కంపోస్ట్ యార్డు తరలింపు ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే దానిని తరలించాలని సూచించారు. ఆయన వెంట కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసరావు, డీఈ సుబ్బారావు తదితరులున్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 29, 37 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై చర్యలు తీసుకుంటాం

డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



తెనాలిఅర్బన్: తెనాలి డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ సలహా సంఘ సమావేశాన్ని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. వీటిని ఎవరూ ప్రోత్సహించరాదని సూచించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ వద్ద లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం నేరమని తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ వినీల్, డాక్టర్ హరిణి, డాక్టర్ సురేష్, సీనియర్ ఏపీపీ పి.సునీల్ కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ముమ్మనేని భానుమతి, పి.వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

సూరేపల్లి(భట్టిప్రోలు): బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర-2047 అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన శనగపల్లి నవ్య (10వ తరగతి) జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చేతుల మీదగా మంగళవారం నవ్య షీల్డ్, సర్టిఫికెట్ అందుకుంది. ప్రతిభ చూపిన నవ్య, శిక్షణ ఇచ్చిన కె. శ్యామకుమారిలను బుధవారం పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, హెచ్ఎం కూచిభొట్ల శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: ఎల్ఐసీ ఏజెంట్లకు వ్యతిరేకంగా యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ బుధవారం రేపల్లె ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ అభివృద్ధికి ఏజెంట్ల కృషి ఎనలేనిదన్నారు. ఏంజెట్ల కమీషన్‌ను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం రేపల్లె బ్రాంచ్ అధ్యక్షుడు డి.బసవ రాజు, డివిజన్ సెక్రటరీ గరికపాటి వెంకటేశ్వరరావు, నాయకులు రాంబాబు, డీటీవీ ప్రసాద్, గుంటి సాంబశివరావు, ఎస్.సాంబశివరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నందివెలుగు దేవాలయంలో మంత్రి మనోహర్ పూజలు



తెనాలిఅర్బన్: దసరా వేడుకలలో భాగంగా నందివెలుగులోని శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో బుధవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, పూజారులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ దూళ్ళిపాళ్ల పవన్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భవనాన్ని అప్పగించాలంటూ డ్వాక్రా సంఘాల వినతి

తెనాలిరూరల్: మండలంలోని సంగంజాగర్లమూడిలో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తున్న భవనాన్ని తమకు అప్పగించాలని డ్వాక్రా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గ్రామానికి చెందిన ఓ దాత తన తదనంతరం భవనాన్ని డ్వాక్రా సంఘాల కార్యకలాపాలకు వినియోగించాలంటూ ఎంపీడీవో పేరున రిజిస్టర్ చేయించారు. అప్పటి అవసరాల కోసం అధికారులు ఈ భవనంలో 12 ఏళ్ల క్రితం అంగన్‌వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఇప్పటికీ కొనసాగుతోంది. దాత ఆశయాలకనుగుణంగా భవనాన్ని తమకు అప్పగించాలని డ్వాక్రా సంఘాల సభ్యులు ఇటీవల తహసీల్దార్ గోపాలకృష్ణకు అర్జీ సమర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇక్కడే కొనసాగించాలని సీడీపీవో, అంగన్‌వాడి టీచర్లు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ బుధవారం సదరు ఆయన భవనాన్ని పరిశీలించి, సీడీపీవో, డ్వాక్రా సభ్యులతో మాట్లాడారు. పాఠశాలలకు దసరా సెలవుల అనంతరం ప్రత్యామ్నాయాన్ని పరిశీలిద్దామని ఇరు వర్గాలకు సూచించారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



బాపట్లటౌన్: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ అహ్మద్‌జానీ తెలిపారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదుచేశారు. సీఐ మాట్లాడుతూ కాలం చెల్లిన వాహనాలు నడిపినా, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపినా అలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షిస్తామన్నారు.వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు

ఏడీఏ ఉషారాణి

తెనాలిరూరల్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెనాలి వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.ఉషారాణి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పర్యటించారు. పొలాలను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులందరూ ఈ కేవైసీ, ఈ-పంటలో వివరాలను నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఘన, ద్రవ జీవామృతాల గురించి వివరించారు. క్షేత్ర సందర్శనలో చీడపీడలు, నాము తెగులును గుర్తించి నివారణ చర్యలను రైతులకు వివరించారు. లాం ఫాం శాస్త్రవేత్త సీహెచ్ శ్రీలత మాట్లాడుతూ వరిలో వచ్చే దోమ పోటుకు పైమెట్రోజైన్ 0.6 గ్రాములు, ట్రైఫ్లూమిజోపైరిన్ 0.486 ఎంఎల్, డైనోటిఫ్యూరాన్‌లలో ఏదైనా వాడవచ్చని సూచించారు. మండల వ్యవసాయశాఖాధికారి జి.ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ ఆకు నల్లి తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం పొడి లేదా కైకోఫాల్ 5ఎంఎల్ గానీ స్పైరోమెసిఫిన్ 1ఎంఎల్ గానీ వాడవచ్చని తెలిపారు. వీఏఏలు హోగ్లా శుభోదయ, మరియ ఏంజెల్స్ పూలే, ఏఈవో జి.మోహనరావు, పంచాయతీ కార్యదర్శి ఇ.మాధవరావు, వీఆర్‌వో శివనాగరాజు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ ఉషారాణి

తెనాలి ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం తెస్తాం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం తీసుకువస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి డిపోకు నూతనంగా వచ్చిన ఆరు బస్సులను, ఆవరణలో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మొదటి విడతలో సీసీ రోడ్డు కొంత భాగం ఏర్పాటు చేయటం జరిగిందని, మరో విడతలో మిగిలిన భాగాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేది ఆర్టీసీ మాత్రమేనని, దీని సేవలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి డిపోలో 100 బస్సులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే డిపోను ప్రథమ స్థానంలో ఉంచే విధంగా చూస్తామని చెప్పారు. తెనాలి-గుంటూరు రోడ్డుకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని.. నిలిచిపోయిన తెనాలి-మంగళగిరి నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని తెలిపారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో డీపీటీవో ఎం.రవికాంత్, డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ఎంఎఫ్ అభిరామ్ నాయక్, ఛీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ వై శ్యామ్ బాబు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్‌ఏ నాయక్, డీఈ వీవీఎల్ రావు, తహసీల్దార్ గోపాల కృష్ణ, డీఎస్పీ జనార్ధనరావు, పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, డీపీటీవో రవికాంత్

• చదువులమ్మా... వందనమమ్మా..



కొల్లిపర దేవాలయంలో...



తెనాలి రామస్వామిపేటలో శ్రీపట్టాభి రామస్వామి దేవస్థానంలో..




మారీసుపేటలోని చంద్రమౌ ళీశ్వరస్వామి దేవస్థానంలో ..



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ..



నందివెలుగు శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో..



రామలింగేశ్వరపేటలోని శ్రీరామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో..



దేవీచౌక్‌లోని శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారికి..

-తెనాలి

మండల అభివృద్ధికి సహకరించండి

ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: నూతనంగా బదిలీలపై మండలంలోని వివిధ శాఖలకు వచ్చిన అధికారులు, సిబ్బంది మండల అభివృద్ధికి సహకరించాలని, అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసికట్టుగా ఉంది గ్రామ అభివృద్ధికి, పారిశుద్ధ్యంపై, ప్రజల సమపస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు గైర్హాజరు అవడం, మరి కొంత మంది సభ మధ్యలో రావటం పై అసహనం వ్యక్తం చేశారు. రాబోయే సమావేశానికి అధికారులందరూ, సర్పంచ్‌లందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు.

రాజకీయ పార్టీలు ముఖ్యం కాదని, అభివృద్ధే ప్రధానమన్నారు. పార్టీలకు అతీతంగా పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమతుందన్నారు. అలాగే పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్పందించాలన్నారు. సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం లభిస్తుందని చెప్పారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మూర్తి మాట్లాడు తూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో యుంజి.యస్.ఆర్.జి.యస్ పథకంకింద 19 గ్రామాల్లో మొత్తం 19 సీసీ రోడ్లు పనుల అంచనాలు కోసం మొత్తం రూ.1.30,00,000 అంచనాలతో గ్రామ సభలో ఆమోదించన ప్రతిపాదనలను వివరించారు. వల్లభాపురం గ్రామంలో సీసీ డ్రెన్ పని అంచనా మొత్తం రూ.5 లక్షలు ఆమోదించటం జరిగిందన్నారు. తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కౌలు తీసుకుని సాగు చేస్తున్న కౌలురైతు ప్రభుత్వం కల్పిస్తున్న కౌలు రైతు కార్డు తీసుకోవాలని అప్పుడే వరదలు వచ్చిన సమయంలో పంట నష్టం జరిగినా, పంట కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలి అన్నా సీసీ కార్డు తప్పని సరిగా ఉండాలని, అందుకు గాను ప్రతి గ్రామంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కౌలు కి తీసుకుని సాగు చేస్తున్న రైతులకు అవగాహన కలిపించి వీలైనంత వరకు ఎక్కువ శాతం కౌలు కార్డులు తీసుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు.

త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి కావున మండలంలో ఎవరైన డిగ్రీ పూర్తి చేసివారు సరైన ధృవపత్రాలతో రెవెన్యూ కార్యాలయంలో అందించినట్లు అయితే వారికి ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు.తొలుత బదిలీపై నూతనంగా వచ్చిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సభ ముఖంగా పరిచయం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్థ, ఈవోపిఆర్డీ బార్గవ, వివిధ శాఖల అధికారలు,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

భట్టిప్రోలు: గ్రామ పంచాయతీల ప్రగతి పథంలో నడవాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి చెప్పారు. ఏపీఎస్ఐఆర్డీ ఆదేశానుసారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి మండలంలోని 15 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ లలిత కుమారి, ఎంపీడీఓ ఎస్‌వీ రమణ, ప్రజా ప్రతినిధులు గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఇంటి, నీటి పన్నుల ద్వారా వచ్చిన వాటిని ఎలా ఖర్చు పెట్టాలి? 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయింపు తదితర అంశాల గురించి ఎంపీపీ వివరించారు. రిసోర్స్ పర్సన్స్ వక్కలగడ్డ సురేష్ బాబు, అడిగోపుల సురేష్‌బాబు, మంచి కోటేశ్వరరావు పంచాయతీ విధులు, బాధ్యతలు, అధికారాల గురించి తెలియజేశారు.



గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎంపీపీ లలిత కుమారి, ఎంపీడీఓ

తూతూ మంత్రంగా..

వేమూరు:గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు బుధవారం శిక్షణ తరగతులు తూతూమంత్రంగా జరిగాయి. ఎక్కువ మంది గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు రాకపోవడంతో అధికారులు కార్యక్రమాన్ని మమ అనిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మద్యం షాపులకు 233 దరఖాస్తులు

తెనాలిరూరల్: తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలోని మద్యం దుకాణాలకు బుధవారం నాటికి 233 దరఖాస్తులు వచ్చాయి. తెనాలి పట్టణం, మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో కలిపి మొత్తం 25 దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. బుధవారం ఒక్క రోజే 85 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువును మరో రెండు రోజులు పెంచడంతో మరిన్న దరఖాస్తులు వచ్చే అవకాశముంటుందని అధికారులు భావిస్తున్నారు.

సిలబస్ తగ్గించాలని వినతి



భట్టిప్రోలు: కొత్తగా మారిన 10వ తరగతి సాంఘిక శాస్త్రంలో సిలబస్‌ను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం (ఏపీఎస్ఏస్టీఎఫ్)రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ బుధవారం విజయవాడలోని ఎస్‌సీఈఆర్టీ కార్యాలయంలో డైరెక్టర్ ప్రతాపరెడ్డిని కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మురళీమోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనటి సురేష్ మాట్లాడుతూ రోల్‌తో సంబంధం లేకుండా 9, 10 తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని, సాంఘిక శాస్త్ర దినోత్సవంగా నవంబర్ 26ను ప్రకటించాలని, జీవో 117 వల్ల ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో కలపడం వల్ల 3 నుంచి 10వ తరగతి వరకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బోధిస్తున్నందున.. ఈ జీవోను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాస్, వెస్ట్ గోదావరి ఆర్థిక కార్యదర్శి అన్నాజి (శ్రీకాకుళం) పాల్గొన్నారు.

మోదుకూరులో నేడు అమ్మ ప్రతిమల ఛాయాచిత్ర ప్రదర్శన

మోదుకూరు(వేమూరు):చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో కనకదుర్గ అమ్మ వారి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా గురువారం వేమన సాహిత్య వికాస పరిషత్ భవనంలో అమ్మ విగ్రహాల, ప్రతిమల ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు యువ పురావస్తు పరిశోధకుడు పాముల పాటి శ్రీనాథ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని, శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు ప్రదర్శన ఉంటుందని వివరించారు.

52వ వర్ధంతి



కీ.శే. సోమవరప్పు వెంకటేశ్వరరావు గారు
మాజీ సర్పంచ్, పెనుమూలి, దుగ్గిరాల మండలం
మరణం : 04-10-1972

మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి,
మా జీవితాలకు వెలుగు ప్రసాదించిన మహా మనిషి,
మా నుండి దూరమై నేటికి 52 సంవత్సరాలైనప్పటికీ
ఇంకనూ మా హృదయాలలో సదా జీవించే యున్నారు.
మీ సవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

యస్. రామారావు, అడ్వకేట్, కొత్తపేట, తెనాలి
షేక్ కటర్, Rtd. EOPRD, పెనుమూలి
షేక్ యాసిన్, టైలర్, పెనుమూలి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)

Office mail : sakshigntadvt@gmail.com